క్లుప్తంగా

పౌల్ట్రీ రైతును ఆదుకోవాలి

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రానికి చెందిన పౌల్ట్రీ రైతు సద్ది రాజిరెడ్డిని ప్రభుత్వం ఆదుకోవాలని సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి అన్నారు. అకాల వర్షాలతో ఈదురుగాలులు రావడంతో సుమారు నాలుగు గంటలపాటు పౌల్ట్రీఫామ్‌కు విద్యుత్ సరఫరా నిలిచి వెయ్యి కోళ్లు మృతిచెంది రూ.3లక్షల నష్టం వాటిల్లిందన్నారు.

ఆర్థిక సాయం

ఎల్లారెడ్డిపేట: సింగారం గ్రామానికి ముత్యాల బాలకృష్ణ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతిచెందగా.. బాధిత కుటుంబానికి హెల్పింగ్ హాండ్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం రూ.10వేల నగదు అందజేశారు.

సిరిసిల్లటౌన్: పట్టణంలోని 36వ వార్డుకు చెందిన నేత కార్మికుడు గుజ్జె శివకుమార్ హఠాన్మరణం చెందాడు. స్థానిక కౌన్సిలర్ కల్లూరి రాజు, 34వ వార్డు కౌన్సిలర్ దార్ల కీర్తన–సందీప్ వేర్వేరుగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి 50కిలోల చొప్పున బియ్యమందించారు.

పేదలకు అన్నదానం

వేములవాడ: వేములవాడ రాజన్న గుడి వద్ద పేదలకు మై వేములవాడ ట్రస్టు ఆధ్వర్యంలో అన్నం పొట్లాలను ఆదివారం అందజేశారు.

చర్చికి విరాళం

వేములవాడరూరల్: నూకలమర్రి క్రీస్తు సంఘం చర్చికి రోమాల లక్ష్మణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విరాళం అందించినట్లు బాధ్యులు రూమాల ప్రవీణ్‌కుమార్ తెలిపారు. చర్చి కోసం కార్పెట్‌తోపాటు మరికొన్ని వస్తువులు అందించారు.

అధికారులు అలసత్వం వీడాలి

ఎల్లారెడ్డిపేట: ప్రకృతి వైపరీత్యాలపై అధికారులు అలసత్వం వీడి అప్రమత్తంగా ఉండాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట పార్టీ కార్యాలయంలో ఆదివారం మాట్లాడారు. వర్షాల వల్ల సామాన్యులకు ఇబ్బంది కలగకుండా సెస్ అధికారులు జాగ్రత్త వహించాలన్నారు. సద్ది లక్ష్మారెడ్డి, లింగంగౌడ్, బాబు, బండారి బాల్‌రెడ్డి, రాములు, రాజునాయక్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం



గూడెంలో దెబ్బతిన్న ఇంటిని పరిశీలిస్తున్న నర్సయ్య

ముస్తాబాద్: అకాల వర్షాలు, గాలివానతో నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వపరంగా అండగా ఉంటామని జెడ్పీటీసీ నర్సయ్య అన్నారు. గూడెం, కొండాపూర్, నామాపూర్, ముస్తాబాద్ గ్రామాల్లో గాలివానతో దెబ్బతిన్న ఇళ్లను ఆదివారం పరిశీలించారు.

క్రికెట్ విజేత నారాయణరావుపేట

ముస్తాబాద్: వరి చంద్రమోహన్ జ్ఞాపకార్థం నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా నారాయణరావుపేట గ్రామం నిలిచింది. పోతుగల్‌పై విజయం సాధించింది. విజేతకు రూ.25వేల నగదు, షీల్డును మాజీ ఎంపీపీ అక్కరాజు శ్రీనివాస్, మాజీ సర్పంచులు గౌతమ్ రావు, పందరి అందించారు. రన్నరప్‌కు రూ.15వేల నగదు, కప్ అందించారు.


స్వగ్రామంపై మమకారంతో ఉచిత వైద్యశిబిరం



ఎన్గల్‌లో వైద్యశిబిరం

చందుర్తి: గ్రామంలో తమ తండ్రి ప్రజాప్రతినిధిగా ప్రజలకు సేవలందించి మృతిచెందాడని, వైద్యాధికారిగా స్వగ్రామంపై ఉన్న మమకారంతో పేద ప్రజలకు వైద్య సేవలందిస్తామని వైద్యాధికారి చీటి లక్ష్మి అన్నారు. ఎన్గల్ గ్రామానికి చెందిన చీటి విజయరావు ఎంపీటీసీగా ప్రజలకు అండగా నిలిచాడని ఆయన కుమార్తె చీటి లక్ష్మి తన తండ్రి జ్ఞాపకార్థం గ్రామంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు.

శ్మశాన వాటికలో అధిక వసూళ్లు ఆపండి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

వేములవాడ: వేములవాడ శ్మశాన వాటికలో శవ దహనాలకు వచ్చేవారిని అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని సీపీఐ నాయకులు కడారి రాములు, వెంకటాద్రి, శ్రీనివాస్, ఎదురుగట్ల కృష్ణ, గాజుల పోశెట్టి, కోరె క్రాంతి ఆరోపించారు. నాయీబ్రాహ్మణులు మొదలుకొని అందరూ అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు.

వేసవి దుక్కులతో ఎంతో లాభం

- లోతు దుక్కులతో చీడపీడల నివారణ
- వర్షం నీరు లోతుకు చేరుతుంది
- తెగుళ్ల నివారణకు అవకాశం
- గొర్రెల మందలు, ఆవు పేడతో సేంద్రియ ఎరువుల లభ్యం



వీర్నపల్లిలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

వీర్నపల్లి: వేసవి దుక్కులు పంట పొలాలకు మేలు చేస్తాయి. నాగళ్ల సాళ్లతో భూమి వదులుగా మారి ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయి. చీడపీడల ప్రభావం తగ్గి పంట దిగుబడులు పెరుగుతాయి. వీర్నపల్లి మండలంలో కొద్ది రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలతో మండలంలోని రైతులు వేసవి దుక్కులు దున్నుతున్నారు. పొలాల్లో మిగిలిన వ్యర్థాలను కలియదున్నితే సేంద్రియ ఎరువుగా మారడంతోపాటు మట్టిని పెకిలించడం ద్వారా భూమిలో గాలి శాతం పెరుగుతుంది.

పంటలకు మేలు

మండల పరిధిలోని సుమారు 6,500 ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేస్తుంటారు. ఏటా ఫిబ్రవరి నుంచి మే వరకు పొలాలు ఖాళీగా ఉంటాయి. ఏప్రిల్, మే నెలల్లో అడపాదడపా జల్లులు పడుతుంటాయి. ఈ దశలో పొలాలను 25 నుంచి 75 సెంటీమీటర్ల లోతులో దుక్కి దున్నితే తొలకరి పైరు వేసుకునేందుకు అనువుగా ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇందులో భాగంగా నాగళ్లు, ట్రాక్టర్లతో రైతులు దుక్కి దున్నుతున్నారు. ఫలితంగా కలుపు మొక్కలు పైకి లేచి ఎండకు మాడిపోతాయి. భూమిలో వివిధ దశల్లో ఉండే పురుగులు పైకి రావడంతో వాటిని పక్షులు తినేస్తాయి. దీంతో పంట కాలంలో పురుగుల సంతతి కనుమరుగై పైరుకు మేలు జరుగుతుంది. వేసవి దుక్కుల వల్ల మొక్కల వేరు వ్యవస్థ బలపడి పోషకాలు అందుతాయని అధికారులు పేర్కొంటున్నారు. భూమి స్థితిని బట్టి దున్నడం వల్ల లోతైన పొరల్లో నేల గుల్లబారి వర్షం పడినపుడు భూమి పొరల్లోకి వెళ్లి పైరుకు నీటి ఎద్దడి లేకుండా కాపాడుతుందన్నారు. మద్దిమల్ల, కంచర్ల, వీర్నపల్లి, రంగంపేట, అడవిపదిర, గర్జనపల్లి, వన్‌పల్లిలోని రైతులు వ్యవసాయ దుక్కులకు దున్నుతున్నారు. ట్రాక్టర్లకు చాలా డిమాండ్ ఉంది.

దున్నకుంటే నష్టాలు

కోతల తర్వాత దుక్కి దున్నకుండా వదిలేయడంతో భూమి గాలిని పీల్చుకునే శక్తి కోల్పోతుంది. దుక్కి దున్నకపోవడంతో లోతైన పొరల నుంచి నీరు ఆవిరైపోతుంది. కలుపు మొక్కలు పెరిగి భూమిలోని నీటిని, పోషక పదార్థాలను గ్రహించి భూసారాన్ని తగ్గిస్తాయి. విత్తడానికి వారం, పది రోజుల ముందు దుక్కులు తయారు చేయడం వల్ల ఆశించినంత దిగుబడి రాకుండా పోతుందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

జీవాల మంద ఉంచడం..

గతంలో ఎండాకాలం పొలాల్లో జీవాల మందను ఉంచేవారు. వాటి మలమూత్రాలు పంటల ఎదుగుదలకు ఉపయోగపడుతుందని రైతులు ఇలా చేసేవారు. ప్రస్తుత రోజుల్లో పశుగణాలు తగ్గి పొలాల్లో మందను కట్టేయడం తగ్గిపోయింది. కొన్ని గ్రామాల్లో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. పశువులు, గొర్రెల నుంచి వచ్చే సేంద్రియ ఎరువుల వల్ల పంటల ఎదుగుదలకు ఉపయోగపడి దిగుబడి అధికంగా ఉంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఇంటి ఆవరణలో లేదా పొలాల వద్ద సంవత్సరం పొడవునా నిలువ చేసిన పశువుల ఎరువులను ఎండాకాలంలోనే పొలాల్లో పోయాలి. వర్షాలు పడిన తర్వాత ఆ ఎరువులను నేలపై చల్లి ట్రాక్టర్‌తో దున్నడంతో మట్టిలో బాగా కలిసిపోతాయి. దీంతో పంటలకు అవసరమైన పోషకాలు అందుతాయి.

వరి కొయ్యలు కాల్చొద్దు



వరి కొయ్యలను పొలంలో కలియదున్నితేనే పంటకు మేలు. పంట దిగుబడి పెరుగుతుంది. కాని రైతులు పట్టించుకోవడం లేదు. వరి కొయ్యలను కాల్చితే భూసారం తగ్గడంతోపాటు పంట దిగుబడి కూడా తగ్గే ప్రమాదముంది. పొలాలను వేసవిలో దున్నుకోవాలి. దీంతో నేలలో ఉన్న పురుగులు చనిపోతాయి. రైతులు జీలుగ విత్తనాలు వేస్తే భూములు సారవంతమవుతాయి.

– శ్రీధర్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి, వీర్నపల్లి

పంట మార్పిడితో భూసారం పెంపు



దుర్గారాజు



మొక్కజొన్న పంట సాగు(ఫైల్)

చందుర్తి(వేములవాడ): రైతులు పంట మార్పిడిని పాటించకపోతే అన్ని విధాలుగా నష్టపోతారు. పంట మార్పిడి చేయకపోవడంతో పంటలకు చీడపీడల ఉధృతి అధికమై పంటల దిగుబడి తగ్గుతుంది. ఒకే పంటను ఒకే భూమిలో ఏళ్ల తరబడి సాగు చేస్తే భూసారం దెబ్బతింటుంది. చీడపీడల తాకిడి అధికమవుతుంది. పంట దిగుబడి తగ్గి రైతులు పంట సాగులో ఆర్థికంగా నష్టపోతారు. ఈ సమస్యలన్నింటిని అధిగమించేందుకు పంట మార్పిడితోనే సాధ్యమవుతుందని చందుర్తి వ్యవసాయాధికారి సీహెచ్ దుర్గారాజు తెలిపారు. వేర్వేరు పంటలు సాగు చేస్తే రైతులకు పంటల దిగుబడి పెరగడంతోపాటు భూమిలో సారం పెరుగుతుందని, చీడపీడల బెడద తక్కువగా ఉంటుందన్నారు. పంటల మార్పిడికి సూచనలు, సలహాలు ఆయన మాటల్లోనే.

- నేల భౌతిక పరిస్థితి మెరుగుపడుతుంది.
- భూమిలో నీరు నిలువ ఉండే శక్తి కలిగి భూసారం వృద్ధి చెందుతుంది.
- చీడపీడలు దూరమవుతాయి.
- ఫలితంగా సస్యరక్షణకు వినియోగించే మందుల ఖర్చు తగ్గుతుంది. శిలీంధ్ర వ్యాధులను దూరం చేయొచ్చు.
- బీజాలు, వాటి అవశేషాలు, వానపాముల అభివృద్ధి కూడా ఎక్కువగానే ఉంటుంది.
- కీటకాల గుడ్లు వృద్ధి చెందకుండా చేసుకోవచ్చు.
- పంటలో నాణ్యత పెరిగి గిట్టుబాటు ఎక్కువగా పొందే అవకాశముంటుంది.

పంట మార్పిడిలో మెళకువలు

- పంట మార్పిడితో నేల ఉపరితలాన్ని పూర్తిగా కప్పే పంటలను ఎంపిక చేసుకోవాలి. శనగ, బబ్బెర, పెసర, మినుము వంటి పంటలను వేసుకోవడం వలన నేలను పూర్తిగా కప్పి ఉంచుతాయి. దీంతో కలుపు మొక్కలను పూర్తిగా నివారించొచ్చు.
- వరి తర్వాత మినుము, పెసర, వేరుశనగ వేయడం వలన సుడిదోమ, తుంగ్రో వైరస్‌ను నివారించొచ్చు.
- పత్తి సాగు చేసే నేలలో మినుము, పెసర, వేయడం వలన తెల్లదోమ ఉధృతి తగ్గుతుంది.
- వేరుశనగ తర్వాత జొన్న, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలి. దీనివలన పంటను ఆశించే ఆకుముడత ఉధృతిని తగ్గించొచ్చు.
- నులి పురుగుల సమస్య అధికంగా ఉన్న భూముల్లో వేరుశనగ, మిరప, వంగ పంటలను కొంతకాలంపాటు తప్పనిసరిగా ఆపాలి.

రైతులు పాటించాల్సినవి..

- భూమిలో తేమ ఎక్కువ కాలం నిల్వ చేసే శక్తి ఉన్నప్పుడు పంట తర్వాత వేరే పంటను వేసి ఏడాదిలో రెండు పంటలు పండించుకోవచ్చు.
- తేలికపాటి నేలలు ఎర్ర, ఇసుక నేలల్లో మిశ్రమ పంటలు వేసుకోవాలి.
- వర్షాకాలం రోజులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఎక్కువ పంటకాలం కలిగిన కంది, నువ్వులు, వేరుశనగ వంటి పంటలను వేసుకోవాలి.
- బంకమన్ను శాతం ఎక్కువగా ఉంటే ఎర్ర నేలలు, నల్లరేగడి నేలలు, పల్లపు ప్రాంతాల్లో పంట మార్పిడి చేసి ఏడాదిలో రెండు పంటలు పండించుకోవాలి.

ఇలా చేస్తే ప్రయోజనం

- యాసంగిలో వేరుశనగ తర్వాత వానాకాలంలో మొక్కజొన్న పంట వేసుకుంటే పైరుకు కొంతమేరకు నత్రజని లభిస్తుంది. దీంతో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించొచ్చు. కంది, శనగ పంటలను వరుసగా వేస్తే కాయ తొలుచు పురుగుల తాకిడి అధికంగా ఉంటుంది. అందుకే ఈ పురుగులు తక్కువగా ఆశించే జొన్న, సోయా చిక్కుడు, నువ్వులు, మినుము, ఉలవ, మెట్టవరి వంటి పంటలతో మార్పిడి చేసుకోవాలి.
- వరితో పంట మార్పిడి చేసుకుంటే వేరుశనగ పంటకు నులి పురుగుల బెడద తగ్గుతుంది.

ఎంపికలో జాగ్రత్తలు తప్పనిసరి

పంట మార్పిడి చేయాలంటే అంతకుముందు వేసిన పంటకు భిన్నంగా పెరిగే పంటను ఎంచుకోవాలి. కొన్ని పంటల వేరు వ్యవస్థలు నేలలోని పొరల నుంచి పోషకాలన్నీ ఎక్కువగా గ్రహిస్తూ ఉంటాయి. నువ్వులు, పొద్దుతిరుగు, మొక్కజొన్న పంటలకు బదులుగా భూమికి పోషకాలను గ్రహించి సమకూర్చే అపరాల పంటలతో మార్పిడి చేసుకుంటే ఫలితముంటుంది.

నకిలీ విత్తనాలు కొనొద్దు

వేములవాడఅర్బన్: వేములవాడ మండలంలోని గ్రామాల్లో రైతులు ఇటీవల కురిసిన వర్షాలకు దుక్కులు దున్ని సిద్ధం చేసుకున్నారు. వేములవాడ అర్బన్‌లో 4,500, వేములవాడ రూరల్‌లో 3,000 ఎకరాల్లో పత్తి పంటను వేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి సాయికిరణ్ తెలిపారు. రోహిణికార్తె వచ్చిందని రైతులు తొందరపడి విత్తనాలు పెట్టొద్దన్నారు. పత్తి పంట వర్షాధార పంట కావడంతో.. సుమారు 5 సెంటీమీటర్ల వర్షం కురిసిన తర్వాతే పంట వేసుకుంటే పత్తి విత్తనాలు మొలకెత్తే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. విత్తనాలు కొనేముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దే కొనాలన్నారు. నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి పత్తి పంట వేస్తే నష్టపోయే అవకాశం ఉందని అన్నారు.

- బోల్‌గార్డ్ 2 ప్యాకెట్‌కు రూ.864 మాత్రమే చెల్లించాలి.
- విత్తనాలు కొనుగోలు చేసిన బిల్‌ను పత్తి పంట దిగుబడి వచ్చేవరకు రైతుల వద్దే భద్రపరచుకోవాలి.
- విత్తనాలు కొనుగోలు చేసే బిల్‌పై విత్తన కంపెనీ పేరు, విత్తన రకం, బ్యాచ్ నంబర్, లాట్ నంబర్, ధర తప్పనిసరిగా ఉండాలి.
- గ్రామాల్లో తక్కువ ధరకు, ఎక్కువ ధరకు విత్తనాలు అమ్మేవారి వివరాలను వ్యవసాయ అధికారులకు వెంటనే తెలియజేయాలి.
- ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి ఎవరైనా నకిలీ విత్తనాలు, కుల్లా విత్తనాలు అమ్మితే వ్యవసాయ అధికారులకు ఫోన్ చేసి చెప్పాలి.

రైతులు మోసపోవద్దు



రైతులు నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దు. వర్షం సుమారుగా దుక్కిలో ఒక్క ఫిట్ మందం తడిసిన తర్వాతనే పత్తి విత్తనాలు వేసుకోవాలి. చిన్న వర్షానికి విత్తనాలు వేసుకుంటే అవి మొలకెత్తే అవకాశం ఉండదు. తొందరపడి విత్తనాలు విత్తి రైతులు ఇబ్బంది పడొద్దు.

– సాయికిరణ్, మండల వ్యవసాయ అధికారి, వేములవాడ

అవార్డు గ్రహీతకు అభినందనలు



నలిమెల భాస్కర్‌కు అవార్డు అందిస్తున్న నిర్వాహకులు


ఎల్లారెడ్డిపేట: ఆచార్య రవ్వా శ్రీహరి జీవన సాఫల్య పురస్కారం అందుకున్న నారాయణపూర్‌కు చెందిన కవి, బహుభాషావేత్త నలిమెల భాస్కర్‌కు అభినందనలు వెల్లువెత్తాయి. పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు మాట్లాడుతూ తమ గ్రామవాసికి అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు. అభినందనలు తెలిపిన వారిలో గోగూరి అంజిరెడ్డి, నిమ్మ నారాయణరెడ్డి, నిమ్మ మల్లారెడ్డి, మోతె మధుసూదన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రతిభా విద్యార్థులకు సన్మానం



సిరిసిల్లటౌన్: ఎస్ఎస్‌సీ, ఇంటర్‌లో ప్రతిభ చాటిన తమ సామాజికవర్గానికి చెందిన విద్యార్థులను ముదిరాజ్ సేవాసమితి ఆదివారం ఘనంగా సన్మానించింది. సిరిసిల్లలో జరిగిన కార్యక్రమంలో ముదిరాజ్ సేవాసమితి జిల్లా అధ్యక్షుడు జెల్ల వెంకటస్వామి మాట్లాడుతూ.. విద్యార్థులు ఇదే స్ఫూర్తితో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ముదిరాజ్ సంఘం పెద్దలు కరుణాల భద్రాచలం, చొక్కాల రాము, గనాది శ్రీనివాస్, యాదగిరి, బొజ్జ లక్ష్మీరాజం, సరుగు నరేష్, భిక్షపతి, బాబు, నరేష్, హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త మల్లన్నను దర్శించుకున్న విప్



రుద్రంగి(వేములవాడ): మానాల గ్రామంలో జరుగుతున్న కొత్త మల్లన్న జాతర వేడుకలకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదివారం హాజరయ్యారు. కొత్త మల్లన్నను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

రేణుకాదేవి కల్యాణం

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ సిద్దోగం వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రేణుకాదేవి, జమదగ్ని కల్యాణం వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య కన్నుల పండువగా జరిగింది. అనంతరం ముత్యాల పోచమ్మకు బోనాలు సమర్పించారు.

ఘనంగా బండ్ల బోనాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బండ్ల బోనాలను ఘనంగా నిర్వహించారు. అంతకుముందు గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. సుమారు 40 ట్రాక్టర్లు, 10 ఎడ్ల బండ్లతో గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు.

హనుమాన్ స్వాములను అవమానించడం సరికాదు

ముస్తాబాద్: కరీంనగర్‌లో హనుమాన్ స్వాములను పోలీసులు అవమానించడం సరికాదని బందనకల్ మాజీ ఉప సర్పంచ్ కార్తీక్‌రెడ్డి అన్నారు. బందనకల్ గ్రామంలో స్వాములతో ఆదివారం ఆందోళన చేపట్టారు.

రాయితీపై జీలుగ విత్తనాలు

బోయినపల్లి: మండల కేంద్రంలోని ఆగ్రోస్, డీసీఎమ్మెస్ కేంద్రాలతోపాటు కోరెం పీఏసీఎస్, వెంకట్రావుపల్లి కేడీసీఎంఎస్‌లలో రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందించనున్నట్లు ఎంఏవో ప్రణీత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఈనెల 27న ఆయా రైతు వేదికల్లో అందుబాటులో ఉండే ఏఈవోలను ఆధార్, పట్టాదార్ పాసు పుస్తకాలతో సంప్రదించాలని కోరారు.

మున్నూరుకాపుల అభివృద్ధికి కృషి

ఎల్లారెడ్డిపేట: మున్నూరుకాపుల అభివృద్ధికి కృషి చేస్తానని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఆ సంఘం భవనంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వపరంగా సంఘం సభ్యులకు ఏ పని ఉన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి సహకారం తీసుకుందామన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు దేవయ్య, ప్రధాన కార్యదర్శి పానిశెట్టి శంకర్‌లను సన్మానించారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడు నంది కిషన్, మండల ప్రతినిధులు సకినాల వెంకటయ్య, తడుకల దేవరాజు, మేగి నర్సయ్య, బండారి బాల్‌రెడ్డి, జంగిడి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడాపోటీలు



బహుమతులు అందిస్తున్న సీఐ, ఎస్సైలు

ఎల్లారెడ్డిపేట: పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండలంలో నిర్వహిస్తున్న క్రీడాపోటీలు ఆదివారం ముగిశాయి. కబడ్డీ పోటీల్లో 14 జట్లు, వాలీబాల్‌లో 26 జట్లు పాల్గొన్నాయి. వాలీబాల్ ఫైనల్‌లో బొప్పాపూర్ విజేతగా నిలవగా, రెండో స్థానంలో దుమాల జట్టు నిలిచాయి. కబడ్డీలో విజేతగా అల్మాస్‌పూర్, ద్వితీయస్థానంలో బొప్పాపూర్ జట్టు నిలిచాయి. మహిళల వాలీబాల్‌లో బొప్పాపూర్(ఏ), బొప్పాపూర్(బీ) జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. విజేత జట్లకు సీఐ శ్రీనివాస్, ఎస్సై రమాకాంత్ అందించారు. మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన జట్లను జిల్లా పోటీలకు ఎంపిక చేశారు.



వేములవాడ: గురువులతో పూర్వ విద్యార్థులు



నిజామాబాద్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

అపూర్వ సమ్మేళనం

వేములవాడ: శ్రీవెంకటరమణ ఉన్నత పాఠశాలలో 1999–2000లో పదోతరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. గురువులను సన్మానించారు. సమ్మేళనం విజయవంతం కావడానికి నెల రోజులుగా కృషి చేసిన నిర్వాహకులు నక్క శ్యామ్‌కుమార్, నేరెళ్ల రాధిక, నేరెళ్ల దేవిక, ఏనుగంటి శివప్రసాద్, రాపర్తి సాయికృష్ణ, ఓటరికారి రజిని, ఎండీ షాదుల్లా, అరెల్లి నరేష్, పొలస కృష్ణ, శివాపర్ణ, కరీంనగర్ సంతోష్, గంగాధర్, బోడిగే దీపక్, యామ బాబులకు సహచర విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

కోనరావుపేట: నిజామాబాద్ ఉన్నత పాఠశాలలో 2002–03 విద్యాసంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు సమావేశాన్ని నిర్వహించారు. చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను ఆహ్వానించి సన్మానించారు.

ప్రభుత్వ కళాశాలలో చేరండి



ఇంటింటా ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని జూనియర్ కాలేజీలో చేరాలని కోరుతూ కళాశాల అధ్యాపకులు ఆదివారం ఎల్లారెడ్డిపేట, బొప్పాపూర్, సింగారం గ్రామాల్లో ప్రచారం చేశారు. ఆయా గ్రామాల్లో పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చేరాలని కోరారు. కళాశాలలో కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు. అధ్యాపకులు క్యాతం సత్యనారాయణ, వాసరవేణి పర్శరాములు, మాదాసు చంద్రమౌళి, చెరుకు భూమక్క, నీరటి విష్ణుప్రసాద్, కొడిముంజ సాగర్, చిలుక ప్రవళిక, అగోలం గౌతమి పాల్గొన్నారు.

జోగాపూర్‌లో బడిబాట

చందుర్తి: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యాబోధన చేస్తున్నామని, తమ పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు గురుకుల పాఠశాలల్లో సీట్లు సాధించారంటూ జోగాపూర్ గ్రామంలో ముందస్తుగా బడిబాట కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆదివారం ప్రచారాన్ని చేపట్టారు. ప్రధానోపాధ్యాయుడు ఎడ్ల కిషన్ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు షేక్ గౌస్‌బాయి పక్షవాతంతో మరణించగా.. వారి కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేటలో ఆదివారం గౌస్‌బాయి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.10వేలు అందించారు.

లేగదూడ మృతి

వీర్నపల్లి: మండల కేంద్రంలో రాజుకు చెందిన లేగదూడ మృతిచెందింది. ఆవుల షెడ్డులో ఆవులను కట్టేసి శనివారం సాయంత్రం సమయంలో ఇంటికి వచ్చాడు. ఉరుములు, పిడుగులతో గాలి దుమారం లేచింది. లేగదూడ పిడుగుల భయానికి కట్టిన తాడును తెంపుకొని 2మీటర్ల లోతు ఉన్న ఒడ్డు కింద జారి పడడంతో మృతిచెందినట్లు తెలిపాడు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

సిరిసిల్లటౌన్: గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఓ ఫంక్షన్ హాలులో ఘనంగా జరిగాయి. వికాస్ డిగ్రీ, పీజీ కళాశాలలో చదివిన విద్యార్థులకు శాతవాహన కళాశాల ప్రిన్సిపాల్, ఎస్‌యూ కామర్స్ డిపార్టుమెంట్ హరికాంత్ చేతుల మీదుగా పట్టాలను అందించారు.

ఆదిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

వేములవాడరూరల్: వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌పై బీఆర్ఎస్ నాయకులు మతిస్థిమితం లేకుండా మాట్లాడడం సరికాదని కాంగ్రెస్ నూకలమర్రి గ్రామ శాఖ అధ్యక్షుడు పాలకుర్తి పర్శరాం గౌడ్ అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు వారి పాలనలో జరిగిన తప్పిదాలను కప్పిపుచ్చుకునే విమర్శలు చేయడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. నాయకులు రోమాల ప్రవీణ్, సంజీవ్, నాగుల మహేశ్, మల్లయ్యగౌడ్, జగదీశ్వర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.